

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

ఏక్ దిన్ కా.. సబ్‌స్టేషన్!


ట్రాన్స్‌ఫార్మర్ లేని సబ్‌స్టేషన్.. పక్కనే గడ్డి మేస్తున్న గొర్రెలు

కేశంపేట మండలం కొండారెడ్డి పల్లిలో ఐదారేళ్ల కింద తలపెట్టిన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. మొన్నటి ఎన్నికల ముందు ప్రజాప్రతినిధులతో సబ్‌స్టేషన్‌ను హడావిడిగా ప్రారంభించారు గానీ సర్వీసు ఫీడర్లను మాత్రం ఏర్పాటు చేయలేదు. అలాగే సబ్‌స్టేషన్‌కు ప్రధానమైన 10ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను సైతం అప్పటికప్పుడు వేరే ఉప కేంద్రం నుంచి తెచ్చి ప్రారంభించారు. ఒకే రోజులో మళ్లీ దానిని ఎక్కడి నుంచి తెచ్చారో అక్కడికే తరలించారు. ఎన్నికల్లో లబ్ధికోసమే సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు తప్పితే ఇక్కడి నుంచి తమకు విద్యుత్ సరఫరా చేయడం లేదని గ్రామస్తులు అంటున్నారు. పనులన్నీ వెంటనే పూర్తిచేసి సబ్‌స్టేషన్‌ను వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు.

- కొండారెడ్డిపల్లిలో ఎన్నికల ముందు హడావిడిగా ప్రారంభం
- 10ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను పెట్టిన వెంటనే తరలింపు!
- సబ్‌స్టేషన్ నుంచి సర్వీసు ఫీడర్లు వేయని అధికారులు
- ఉప కేంద్రాన్ని వినియోగంలోకి తేవాలంటున్న గ్రామస్తులు

పనులను గాలికొదిలేశారు



ఎన్నికలు వచ్చిన తరుణంలో రెండు నెలల కింద సబ్‌స్టేషన్‌ను హడావిడిగా ప్రారంభించారు. ఆ తరువాత అధికారులు దాని నిర్వహణను గాలికొదిలేశారు. గ్రామ గ్రామానికి 24గంటలూ కరెంటు ఇస్తామన్న అధికారులు ఇప్పటి వరకు పనులను మాత్రం పూర్తి చేయకపోవడం సరికాదు. దీనిని ఎన్నికల కోసమే ప్రారంభించినట్లు ఉంది. ఆరేళ్లుగా సబ్‌స్టేషన్ పనులు చేస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకొని సబ్‌స్టేషన్ నుంచి కరెంటు సరఫరా చేయించాలి.

- మల్లేష్‌గౌడ్, కొండారెడ్డిపల్లి

విద్యుత్ అధికారుల మాయాజాలం

కేశంపేట, జనవరి 4: విద్యుత్ శాఖ అధికారులు మాయాజాలాన్ని చూపాలనుకున్నారో? లేక ప్రజలను మభ్యపెట్టేందుకో గానీ ఎన్నికల ముందు హడావిడిగా విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించి ఇప్పుడు గాలికొదిలేశారు. సబ్‌స్టేషన్‌కు ఇన్‌కమింగ్ మాత్రం సప్లైచేసి ఫీడర్లకు విద్యుత్ సరఫరా చేయకపోవడం ఇక్కడ మరో విచిత్రం. విద్యుత్ పంపిణీ లైన్లు వేయకుండానే సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ప్రారంభించిన మరుసటి రోజే షట్ డౌన్ చేశారు! వివరాల్లోకి వెళ్తే.. కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి(పోమాల్‌పల్లి) శివారులో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హయాంలో రూ.2కోట్లతో 33/11కేవీ సబ్‌స్టేషన్‌ను తలపెట్టారు. మొదట చింతకుంటపల్లి శివారులో సబ్‌స్టేషన్ వేయాలని తలచిన అధికారులు, అక్కడ భూమి లభించక కొండారెడ్డి పల్లిలో ఏర్పాటుకు నిర్ణయించారు. సర్వే నంబర్ 149/7లో గండి యాదయ్యకు చెందిన 30గుంటల అసైన్డ్ భూమి సేకరించారు. 2018లో సబ్‌స్టేషన్ నిర్మాణ ప్రారంభమై 5ఏళ్లలో 90శాతం పనులు పూర్తిచేశారు. ఇన్‌కమింగ్ లైన్ వేశారు. కానీ గ్రామాలకు విద్యుత్ సరఫరా కోసం ఫీడర్లను మాత్రం వేయలేదు. 2024 అక్టోబరు 7న విద్యుత్ శాఖ అధికారులు ఎన్నికలు తరుముకొచ్చిన సందర్భంలో హడావిడిగా ప్రజాప్రతినిధులతో సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. మరో గమ్మత్తయిన విషయం ఏమిటంటే.. సబ్‌స్టేషన్‌ను ప్రారంభించేందుకు 10ఎంవీఏ ట్రాన్స్‌పార్మర్‌ను అప్పటికప్పుడు వేరే సబ్‌స్టేషన్ నుంచి తెచ్చి ఓపెనింగ్ చేసిన తరువాత మళ్లా అక్కడికే తీసుకెళ్లారు. ఇప్పుడీ సబ్‌స్టేషన్ నుంచి ఎక్కడికీ విద్యుత్ సరఫరా కావడం లేదు. ఎన్నికల కోడ్ వస్తే నేతలు ప్రారంభించేందుకు వీలు కాదు కాబట్టే ఓపెనింగ్‌కు హడావిడి చేసినట్లు రైతులు, గ్రామస్తులు అంటున్నారు. చింతకుంటపల్లి వైపు వేసిన విద్యుత్ స్తంభాలు కూలి ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం ఈ సబ్‌స్టేషన్‌లో 10ఎంవీఏ ట్రాన్స్‌పార్మర్ కూడా లేక ఇన్‌కమింగ్ జంపర్లనూ ఆఫ్ మోడ్‌లో ఉంచారు. మిగిలిన చిన్నచిన్న పనులు కూడా చేయకుండా పక్కన పెట్టేశారు. సబ్‌స్టేషన్ ప్రాంగణంలోకి పశువులు, గొర్లు మేకల మందలు మేతకు వస్తున్నాయి. అంతేకాకుండా సబ్‌స్టేషన్‌లో ఉన్న విలువైన విద్యుత్ పరికరాలకూ రక్షణ కరువైంది.


మూలన పడేసిన ఇన్స్యూలేటర్లు


ఇన్‌కమింగ్ రాకుండా ఆఫ్ చేసిన జంపర్లు


ట్రాన్స్‌ఫార్మర్ లేక ఖాళీగా ఉన్న గద్దె

సబ్‌స్టేషన్‌ను త్వరలోనే అందుబాటులోకి తెస్తాం

కొండారెడ్డిపల్లి సబ్‌స్టేషన్‌ను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తాం. 10 ఎంవీఏ ట్రాన్స్‌పార్మర్‌ను రిపేర్‌కు తరలించాం. మూన్నాలుగు రోజుల్లో ట్రాన్స్‌పార్మర్‌ను తెచ్చి బిగిస్తాం. గ్రామాల్లో గృహ వినియోగదారులకు 24గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తాం. కాంట్రాక్టర్‌తో మాట్లాడి కూలిన విద్యుత్ స్తంభాల సమస్య పరిష్కారానికి సైతం చర్యలు తీసుకుంటాం.

- ఈశ్వర్, ట్రాన్స్‌కో ఏఈ, కేశంపేట

సబ్‌స్టేషన్ ప్రారంభమైనట్టా? కానట్టా?



కొండారెడ్డిపల్లిలో కొత్తగా పెట్టిన విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం అయ్యిందా.. కాలేదా అనేది అధికారులే చెప్పాలి. 'ఏక్ దిన్ కా సుల్తాన్' అన్నట్లు మా సబ్‌స్టేషన్ పరిస్థితి తయారైంది. మేం ఎంతో కష్టపడి యాదయ్య అనే రైతు నుంచి సబ్‌స్టేషన్ కోసం స్థలాన్ని ఇప్పించాం. సబ్‌స్టేషన్ మాత్రం నేటికీ మాకు అందుబాటులోకి రాలేదు.

- పల్లె ఆనంద్‌కుమార్, కొండారెడ్డిపల్లి

ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్న భారత్

- కేంద్ర పథకాలతో సంతోషంగా ఉన్న ప్రజలు
- బొగ్గు, గనులు శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి

మహేశ్వరం, జనవరి 4: ఒకప్పుడు భారత్ అభివృద్ధి చెందుతున్న దేశమని ప్రపంచ దేశాలు అనేవని.. ఇప్పుడు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో అభివృద్ధిలో ఇండియా ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందని కేంద్ర బొగ్గు, గనులు మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా గురువారం మహేశ్వరం మండలం మాణిక్యమ్మగూడలో సర్పంచ్ చంద్రయ్యగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. 2047 నాటికి భారత్‌ను స్వావలంబన దేశంగా తయారు చేస్తామని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులతో మంత్రి ప్రతిజ్ఞచేయించారు. పేదల ఆరోగ్యం, అభివృద్ధే లక్ష్యంగా ప్రధానమంత్రి పనిచేస్తున్నారన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఆయన పనిచేస్తున్నారన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల అభివృద్ధికి ఆయుష్మాన్ భారత్, ఆవాజ్‌యోజన, ఫసల్ బీమా, ఉజ్వల వంటి పథకాలెన్నో అమలు చేస్తున్నట్లు తెలిపారు. పేదలు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు బ్యాంకర్లు వారికి విరివిగా రుణాలు ఇవ్వాలని ప్రధాని సూచించారన్నారు. రైతుల కోసం కేంద్రం అమలుచేస్తున్న పథకాలు సంపూర్ణంగా వారికి చేరేలా అధికారులు ప్రచారం చేయాలన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్రం పెద్దపీట వేసిందన్నారు. తెలంగాణలో అమలవుతున్న ప్రతీ పథకంలో కేంద్రం వాటా ఉందనే నిజాన్ని ప్రజలు గమనించాలన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం వచ్చి ఉంటే ప్రజలకు ఉచిత వైద్యం, విద్య ఇచ్చేవారిమన్నారు. ఈ సందర్భంగా మంత్రి పంటలపై మందులు పిచికారీ కోసం కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న డ్రోన్‌ను ప్రారంబించారు. మహిళా సంఘాల రుణాల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్.సునీత, బీజేపీ నాయకులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, శ్రీరాములు, కేఎస్.రత్నం, నర్సింహారెడ్డి, ప్రేమ్‌రాజ్, సుదర్శన్‌రెడ్డి, మాధవాచారి, యాదయ్యగౌడ్, టి.యాదీష్, దేవ్యానాయక్, ఆర్డీవో సూరజ్‌కుమార్, తహసీల్దార్ మహమూద్ అలీ, ఎంపీడీవో నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శశాంక

రంగారెడ్డి అర్బన్, జనవరి 4: రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా కె.శశాంక గురువారం బాధ్యతలు స్వీకరించారు. మధ్యాహ్నం 12గంటలకు కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు అదనపు కలెక్టర్లు భూపాల్‌రెడ్డి, ప్రతిమాసింగ్ స్వాగతం పలికారు. ఇప్పటి వరకు జిల్లాకు పూర్తిస్థాయి ఇన్‌చార్జి కలెక్టర్‌గా పనిచేసిన గౌతమ్ పొట్రు నూతన కలెక్టర్ శశాంకకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం డీఆర్వో సంగీత, డీపీఆర్వో పద్మశ్రీ, డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభాకర్, డీఈవో సుశీందర్‌రావు, సివిల్ సప్లయీస్ అధికారి రాథోడ్, పరిశ్రమల శాఖ అధికారి రాజేశ్వర్‌రెడ్డి, డీఏవో గీతారెడ్డి, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, పశుసంవర్థక శాఖ అధికారి అంజిలప్ప, జెడ్పీ సీఈవో దిలీప్‌కుమార్, జిల్లా మత్స్య శాఖ అధికారి సుకీర్తి, వివిధ దిన పత్రికల రిపోర్టర్లు, తదితరులు కొత్త కలెక్టర్‌కు ఫ్లవర్ బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

దశలవారీగా భూ సమస్యలు తీరుస్తాం

యాచారం, జనవరి 4 : రాష్ట్రంలో దశలవారీగా భూ సమస్యలను తీరుస్తామని, ఇందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసకుంటున్నారని భూ తగాదాల సంబంధిత న్యాయ నిపుణుడు, లీఫ్ సంస్థ చైర్మన్ సునీల్‌కుమార్ అన్నారు. గురువారం యాచారంలో వివిధ గ్రామాల రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇంత వరకు ధరణిలో భూముల వివరాలు నమోదు కాక ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో భూ సమస్యలను వందశాతం పరిష్కరించి రాష్ట్రంలో యాచారాన్ని ఆదర్శ మండలంగా నిలిపేందుకు జాతీయ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి చొరవ తీసుకుంటున్నారని చెప్పారు. రైతులు భూ తగాదాలు పెట్టుకోవద్దని హితవు పలికారు. ధరణితో భూరికార్డులు అస్తవ్యస్తంగా తయారై వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో ఎం.కోదండరెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

తగ్గని చలి తీవ్రత

- ఇబ్బంది పడుతున్న జనం

రంగారెడ్డి అర్బన్, జనవరి 4 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చలి పులి చంపేస్తోంది.. గురువారం వికారాబాద్ జిల్లా మర్పల్లిలో 13.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. కాగా రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో 13.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మౌలాలిలో 15.5డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. చలి తీవ్రతతో జనం ఇబ్బంది పడుతున్నారు. ఉదయం స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు, గృహిణులు, పనులకు బయటకు వెళ్లే వారు చలికి వణుకుతూ పనులు చేసుకుంటున్నారు.ఆచ్ఛాదనగా స్వెటర్లు, మఫ్లర్లు, కుల్లాలు వాడుతున్నారు. చలి కాచుకుంటున్నారు.



అసైన్డ్ భూములపై విచారణ చేయించండి

- రెవెన్యూ మంత్రికి ఎమ్మెల్యే వినతి


మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూర్, జనవరి 4: మండలంలోని సిద్ధాపూర్ శివారులో గల అసైన్డ్ భూముల లెక్కలు తేల్చి, విచారణ చేయించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ శాఖ కార్యదర్శి నవీన్‌మిట్టల్‌లకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గురువారం వినతిపత్రాలు ఇచ్చారు. హైదరాబాద్‌లో వారిని కలిసి భూములపై వివరించారు. గ్రామంలో 334ఎకరాల భూమిని పేదలకు అసైన్ చేశారని తెలిపారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ భూమిని సేకరించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రతిపాదించిందన్నారు. కాగా ఎన్నికల ప్రచారంలో షాద్‌నగర్‌కు వచ్చినఅప్పటి మంత్రి కేటీఆర్... సిద్ధాపూర్‌లో ఐటీ హబ్‌ను ఏర్పాటు చేస్తామంటూ మాటమార్చారన్నారు. పేదల భూములను ఎందుకు లాక్కున్నారో నిగ్గు తేల్చాలని ఎమ్మెల్యే శంకర్ మంత్రిని కోరారు. కాగా దీనిపై ఎమ్మెల్యేను 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో సంప్రదించగా.. సిద్ధాపూర్ అసైన్డ్ భూములపై రెవెన్యూ మంత్రి, సెక్రటరీలకు వినతిపత్రాలు ఇచ్చినట్లు నిర్ధారించారు. ఈ భూముల సేకరణలో అవకతవకలకు పాల్పడి రైతులకు అన్యాయం చేశారన్నారు. స్పెషల్ కలెక్టర్‌తో విచారణ జరిపించేందుకు మంత్రి ఆదేశాలు జారీ చేశారని ఎమ్మెల్యే వివరించారు.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత



శంషాబాద్ రూరల్, జనవరి 4: శంషాబాద్ విమానాశ్రయంలో ఓ ప్రయాణికురాలు అక్రమంగా తెచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ మహిళ గురువారం తెల్లవారుజామున దుబాయ్ నుంచి వచ్చారు. ఎయిర్‌పోర్టు కస్టమ్స్ అధికారులు ఆమె బ్యాగులు తనిఖీలు చేయగా 526గ్రాముల బంగారు గొలుసు లభించింది. దీనికి బిల్లు లేకపోవడంతో అధికారులు ఆభరణాన్ని సీజ్ చేశారు. ఈ బంగారం విలువ 34.02లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.



తాండూరు ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని గురువారం డీఎస్పీ శేఖర్‌గౌడ్, సీఐ రాజేందర్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ అనంతయ్య, ఫైర్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

- తాండూరు, జనవరి 4

కబ్జాకు గురైన పార్కు స్థలాలను కాపాడాలి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

మేడ్చల్ టౌన్, జనవరి 4: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో అన్యాక్రాంతమవుతున్న పార్కు స్థలాలను కాపాడాలని బీజేపీ జిల్లా నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వంశీవిజయ్ డిమాండ్ చేశారు. గురువారం మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడ్చల్‌లోని పలు వెంచర్లలో పార్కుల కోసం వదిలిన స్థలాలు పూర్తిగా అన్యాక్రాంతమయ్యాయని ఆరోపించారు. పంచాయతీ లేఅవుట్, హెచ్ఎండీఏ లేఔట్‌లో పార్కులకోసం వదిలిన స్థలాలను కొందరు కబ్జాచేసి నిర్మాణాలు చేపట్టారని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా పలువురు బహుళ అంతస్తులు నిర్మిస్తున్నా మున్సిపల్ సిబ్బంది చోద్యం చూస్తున్నారన్నారు. అనుమతిలేని కట్టడాలు యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పార్కుస్థలాలను కాపాడటంతో పాటు, అక్రమ నిర్మాణాలను అరికట్టాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు.

ఆటో డ్రైవర్ల భిక్షాటన



బస్సులో భిక్షాటన చేస్తున్న ఆటో డ్రైవర్

మేడ్చల్‌టౌన్, జనవరి 4 : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం వల్ల ఆటో డ్రైవర్ల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అడుక్కునే స్థితికి తెచ్చిందని ఆటో డ్రైవర్ల యూనియన్ మేడ్చల్ అధ్యక్షుడు ఎర్ర విజయరావు ఆరోపించారు. మహాలక్ష్మి పథకాన్ని నిరసిస్తూ గురువారం మేడ్చల్ పట్టణంలో ఆటో డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో మేడ్చల్ ఆర్టీసీ డిపో వద్ద బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల వద్ద భిక్షాటన చేపట్టి నిరసన తెలిపారు. ఈసందర్భంగా విజయరావు మాట్లాడుతూ... మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఆటోలు నడుపుకుని జీవనోపాధి పొందుతున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలు దయనీయ స్థితికి చేరాయన్నారు. ఉచిత ప్రయాణంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని, తమ విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకునేంత వరకు నిరసలు ఆగబోవన్నారు

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



పరిగిలో సమావేశమైన ఉద్యమకారులు

పరిగి, జనవరి 4: తెలంగాణ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం పరిగి మండల ప్రతినిధులు ఎం.నాగేశ్వర్, నీరటి నరహరి, అకుతోట సత్యనారాయణ, పి.గోవింద్‌నాయక్‌లు అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం గురువారం పరిగిలోని ఏబీఎస్ ప్లాజాలో జరిగింది. అమరులైన ఉద్యమకారులు బందెయ్య, అంతారం నర్సింహ్మ, వేణుగోపాలచారి ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ కోసం అమరులైన 1200 మందిలో ఇంకా చాలా మందికి ప్రభుత్వ సహాయం అందలేదన్నారు. కేసులు ఉన్నవారికే కాకుండా ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న వారి వివరాలను సేకరించి, వారికి 250 గజాల ఇంటిస్థలంతోపాటు, నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇంటర్నేషనల్ స్కూళ్లలో ఉద్యమకారుల పిల్లలకు 10 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని కోరారు. ఉద్యమ లక్ష్మీ పేరుతో ప్రతి ఉద్యమకాకరుడికి నెలకు రూ.5 వేల పింఛన్ ఇప్పించాలని కోరారు. తెలంగాణ సాంస్కృతిక సారథిలో కూడా ఉద్యమకళాకారులకు అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారుల సంఘం నాయకులు విద్యాసాగర్, ముజీబ్, యాదగిరి, మల్కయ్య, శంకర్, అనిత, యాదయ్య, డి.గోపాల్, పరశురాం, డి.శ్రీనివాస్, మొగులయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఫసియొద్దీన్ మృతి తీరని లోటు



ఫసియొద్దీన్ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న శుభప్రద్ పటేల్

వికారాబాద్: తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఫసియొద్దీన్ (సర్దార్) మృతి తీరని లోటు అని తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు ఎన్.శుభప్రద్ పటేల్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న మైనార్టీ నాయకుడు ఫసియొద్దీన్ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. రాజీవ్‌నగర్ కాలనీలోని ఫసియొద్దీన్ ఇంటివద్ద అతని మృతదేహానికి శుభప్రద్ నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో జిల్లాగ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎండీ హఫీజ్, మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, నాయకులు దత్తు, పాల్గొన్నారు.

అధిష్ఠానం ఆదేశిస్తే లోక్‌సభ ఎన్నికల బరిలో ఉంటా

- మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తా
- మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి



మేడ్చల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): త్వరలో జరగబోయే లోకసభ ఎన్నికల్లో అధిష్ఠానం ఆదేశిస్తే బీఆర్ఎస్ తరపున మల్కాజిగిరి పార్లమెంటు నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ మంత్రి హోదాలో పనిచేసిన తాను ఎమ్మెల్యే పదవిలో ఇమడలేకపోతున్నానని అన్నారు. ఎంపీగా పోటీచేసి పార్లమెంటుకు వెళ్లాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ భవన్‌లో పార్లమెంటు నియోజకవర్గ విస్తృత స్థాయిలో సమావేశాలు జరుగుతున్న తరుణంలో మల్లారెడ్డి వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశం కూడా ఈనెల 21న నిర్వహించనున్నారు. రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయిన బీఆర్ఎస్ మళ్లీ ప్రజల్లో పట్టుని పెంచుకునేందుకు ఎంపీ ఎన్నికలను కీలకంగా భావిస్తోంది. లోక్ సభ ఎన్నికల్లో అవలంభించాల్సిన వ్యూహాలపై హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ భవన్‌లో రోజుకో పార్లమెంటు నియోజకవర్గంపై సమీక్షలు నిర్వహిస్తోంది. దేశంలోనే అతిపెద్ద పార్లమెంటు నియోజకవర్గమైన మల్కాజిగిరి నుంచి బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి పోటీ చేసేందుకు పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు విస్తరించి ఉన్నాయి. మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఎల్‌బీనగర్, ఉప్పల్, కంటోన్మెంట్ నియోజకవర్గాలుండగా అన్ని నియోజకవర్గాల్లోనూ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. 2014లో మల్లారెడ్డి మల్కాజిగిరి పార్లమెంటు నియోజవకర్గంలో టీడీపీ నుంచి పోటీచేసి గెలుపొందారు. ఆ తర్వాత 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొంది మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆయన మేడ్చల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటికీ రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రాకపోవడంతో ఎంపీగా పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నారు. అధిష్ఠానం ఆదేశిస్తే తాను ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు.

సెయింట్ పీటర్స్ కళాశాలలో నాట్యోత్సవం

- కళలు, సాంస్కృతిక కార్యక్రమాల పై విద్యార్థులకు అవగాహన



కళాకారుల భరత నాట్య ప్రదర్శన

మేడ్చల్ టౌన్, జనవరి 4 : విద్యార్థులకు చదువుతో పాటు కళలు, సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించటానికి తమ కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గుండ్లపోచంపల్లి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి టీ.వీ.రెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో టాప్స్ సొల్యూషన్ వారి ఆధ్వర్యంలో, స్టూడెంట్స్ కౌన్సిల్ సహకారంతో 'బృందావన్ నాట్యోత్సవం 2024'ను నిర్వహించారు. ఈ సందర్భంగా టీ.వీ.రెడ్డి మాట్లాడుతూ.. దేశ సంస్కృతిలో కళలకు ప్రాధాన్యత ఎంతో ఉందని, సకల కళల సమ్మేళనంతో మన సంస్కృతి ఇమిడి ఉందని చెప్పారు. అన్ని కళలను గౌరవించి వాటిని ప్రోత్సహిచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పలు నాట్య సంస్థల కళాకారులు నాట్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో చెన్నైలోని కళాక్షేత్ర ఫౌండేషన్ కాలేజ్‌కు చెందిన ఆకాంక్ష, జవహర్ నవోదయ విశ్వ విద్యాలయానికి చెందిన శోభన సదా గోపాల్, వీరేంద్ర డాన్స్ ఆఫ్ స్కూల్ లర్నింగ్ డైరెక్టర్ శేశాద్రి సాధన, ఫౌండర్ డైరెక్టర్ కళా అంబాల, క్రిష్ణగిరికి చెందిన అపర్ణ సుందరం , కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. శ్రీలత, అకాడమిక్ డైరెక్టర్ సరోజా రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి, పీఆర్వో రవి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి : సీఐ



వాలీబాల్ పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న సీఐ శివప్రసాద్

కడ్తాల్, జనవరి 4: ప్రతిభ ఉన్న క్రీడాకారులకు ప్రతి ఒక్కరు చేయూతనందించి ప్రోత్సహించాలని కడ్తాల్ సీఐ శివప్రసాద్ అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో తెలంగాణ యువజన సంఘాల ఐక్య వేదిక, వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. నిర్వాహకుడు రాఘవేందర్, ఎస్ఐ హరిశంకర్‌గౌడ్‌లతో కలిసి సీఐ శివప్రసాద్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ క్రీడలు శారీరక ధారుఢ్యం, మానసిక వికాసానికి ఎంతగానో దోహదపడుతాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మొగిళ్ల చెన్నయ్య, కాంటేకార్ వెంకటేశ్, కుమార్, మురళి, అంజి, వేణు, మధు, నరేశ్, సన్ని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం లక్ష్మణ్, సర్పంచ్ సంధ్యారాణి

షాబాద్, జనవరి 4: బడీడు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని షాబాద్ మండల నోడల్ అధికారి, సర్దార్‌నగర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, కుర్వగూడ సర్పంచ్ సంధ్యారాణి మల్లిఖార్జున్‌గౌడ్ అన్నారు. గురువారం కుర్వగూడ గ్రామంలో పాఠశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఆకృతి ఫీల్డ్ ఆఫీసర్ రామకృష్ణ, కోఆప్టెడ్ మెంబర్ దాదె మహేష్‌తో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరక్షరాస్యత నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని అన్నారు. పిల్లలను బడిలో చేర్పిస్తేనే వారికి మంచి భవిష్యత్‌ను చూపిన వారమవుతామన్నారు. బడి ఈడు పిల్లలందరిని బడిలో చేర్పించి, భావి పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లలను పాఠశాలకు పంపే బాధ్యత తల్లిదండ్రులపైన ఉందన్నారు. విద్యార్థులు చదువుకుని అక్షరాస్యులు కావాలని సూచించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు యువకులు, గ్రామస్థులు నడుం బిగించాలన్నారు. దేశభవిష్యత్తు విద్యార్థుల చేతిలో ఉందని, అందుకోసం విద్య ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు నర్సింహులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిలీ లిపి కనుక్కోవడం గొప్ప విషయం

» అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, జనవరి 4: లూయిస్ బ్రెయిలీ అంధుల కోసం ప్రత్యేకంగా లిపిని కనుక్కోవడం ఎంతో గొప్ప విషయమని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం లూయిస్ బ్రెయిలీ 215వ జయంతిని కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. బ్రెయిలీ లిపితో ఎంతో మంది దివ్యాంగులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదిగారని తెలిపారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి మాట్లాడుతూ.. దివ్యాంగులకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 30కోట్ల మంది అంధులు బ్రెయిలీ లిపితో అక్షరజ్ఞానాన్ని పొందగలిగారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా



దివ్యాంగులతో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

శిశు సంక్షేమ శాఖ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్, జయరాం నాయక్, వెంకటేశ్వరమ్మ, కాంతారావు, సీనియర్ అసిస్టెంట్ జహీరుద్దీన్, రాములు, ఎఫ్ఆర్‌వో వెంకటేష్, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్‌లో రోడ్ల మరమ్మతుకు రూ.300కోట్లు

» అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మర్పల్లి, జనవరి 4: వికారాబాద్ నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులకు రూ.300కోట్ల నిధులు మంజూరైనట్లు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలన సదస్సులో గురువారం ఆయన పాల్గొన్నారు. మండలంలోని 98మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే సీఎం రేవంత్‌రెడ్డి ఆశీర్వదంతో తెలంగాణ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టానని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వికారాబాద్ జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. అభివృద్ధికినిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వికారాబాద్‌లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో పాటు మరిన్ని నిధుల కోసం కేంద్రానికి నివేదిక పంపించినట్లు



మాట్లాడుతున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లలిత, జడ్పీటీసీ మధుకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు కలీమోద్దీన్, రాములుయాదవ్, సుభాష్‌యాదవ్, జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ కొండల్‌రెడ్డి, సుభాష్‌యాదవ్, రామేశ్వర్, దివాకర్, తహసీల్దార్ గణేశ్, ఎంపీడీవో రాజమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఆధార్ సెంటర్లను పెంచండి

» ఎమ్మెల్యే వీర్లపల్లికి సీపీఎం నాయకుల వినతి

షాద్‌నగర్ అర్బన్, జనవరి 4: షాద్‌నగర్ పట్టణంలో ఆధార్ కేంద్రాల సంఖ్యను పెంచి ప్రజలు ఇబ్బందులను పరిష్కరించాలని సీపీఎం నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గురువారం సీపీఎం నాయకుడు శ్రీనునాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి సమస్యను వివరించారు. షాద్‌నగర్ పట్టణంలో రెండు మాత్రమే ఆధార్ కేంద్రాలున్నాయని, కొత్త కార్డులతో పాటు మార్పుల కోసం పడికాపులు కాయాల్సి వస్తుందని వివరించారు. ప్రతీ రోజు 50కార్డులు మాత్రమే జారీ అవుతున్నందున రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని విన్నవించారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా అధిక డబ్బులు తీసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆధార్ సెంటర్ల సంఖ్యను పెంచి, ప్రభుత్వ నిబంధనల మేరకు డబ్బులు తీసుకునే చర్యలు తీసుకోవాలని శ్రీనునాయక్ ఎమ్మెల్యేను కోరారు.

తంగడ్‌పల్లికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి

చేవెళ్ల, జనవరి 4: తంగడ్‌పల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సును నడిపించాలని కాంగ్రెస్‌పార్టీ చేవెళ్ల మండల ఉపాధ్యక్షుడు పాండుయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం తంగడ్‌పల్లి గ్రామస్తులు, పలువురు నాయకులు వికారాబాద్ డిపో మేనేజర్‌కు వినతి ప్రతం ఇచ్చారు. ఈసందర్భంగా పాండుయాదవ్ మాట్లాడుతూ తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని చెప్పారు. తమ గ్రామానికి అధికారులు బస్సును నిలిపివేశారని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చేవెళ్ల నుంచి తంగడ్‌పల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సును నడిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, ఆంజనేయులు, రాఘవరెడ్డి, మల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎండి. సలీం తదితరులు ఉన్నారు.



డిపో మేనేజర్‌కు వినతిప్రత్రాన్ని అందిస్తున్న తంగడ్‌పల్లి నాయకులు



చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఆరు గ్యారంటీలు.. పక్కాగా అమలు

చేవెళ్ల, జనవరి 4 : రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. గురువారం రేగడిఘనాపూర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు భీంభరత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం 'ప్రజాపాలన కార్యక్రమం'ను తీసుకువచ్చిందని చెప్పారు. గ్రామాల్లో జరుగుతున్న ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకుని, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈదులపల్లి రాములు, సీహెచ్ రాజేశ్, అంజిరెడ్డి, హరిశ్వర్‌రెడ్డి, యాదయ్య, కృష్ణ, మాణయ్య, దయానంద్, జంగయ్య, రాయికంటి మాణిక్యం, రాములు తదితరులు ఉన్నారు.

అక్రమంగా నాపరాతి తవ్వకాలు చేపడితే చర్యలు

» మైన్స్ ఏడీ శామెల్ జాకబ్

తాండూరు రూరల్, జనవరి 4: నాపరాతి గనుల్లో ఎవరైనా లీజులు లేకుండా అక్రమంగా తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తాండూరు మైన్స్ ఏడీ శామెల్ జాకబ్ హెచ్చరించారు. మండలంలోని సంగెంకలాన్ గ్రామ శివారులో అక్రమంగా తవ్వుతున్న సర్వేనెంబర్-109ని సందర్శించి పరిశీలించారు. సర్పంచ్ మేఘనాథ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు అట్టి గనిని సందర్శించగా, అదే గ్రామానికి చెందిన వ్యక్తి 35మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరిపారని, దానిపై ఏ లెవల్ తవ్వకాలు చేపట్టారు. ఎంత మేరకు నాపరాతిని కట్ చేశారు. ఎన్ని మీటర్ల లోతు, ఎంత ముడి సరుకును తవ్వకాలు జరిపారనే దానిపై సమగ్ర వివరాలు సేకరించారు. ఈ నాపరాతి గనికి విద్యుత్ శాఖ నుంచి మీటరు తీసుకోవడానికి అనుమతి ఉందా? ఎంత బిల్లు చెల్లిస్తున్నారనే విషయంపై విద్యుత్ శాఖ ఏఈ నాయుడును అడిగి తెలుసుకున్నారు. మండలంలోని మల్కాపూర్, సంగెంకలాన్, ఓగీపూర్, కోటబాస్పల్లి, సిరిగిరిపేట్ తదితర గ్రామాల్లోని ఎక్కడైనా అనుమతులు లేకుండా నాపరాతి తవ్వకాలు జరిపితే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. మండల పరిధిలోని మల్కాపూర్ సర్వేనెంబర్-74, 115, ఓగీపూర్ సర్వేనెంబర్-2, 129, కరన్‌కోట్ సర్వేనెంబర్-34 తదితర ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలపై క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రత్యేక దృష్టి సారించి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా అక్రమ కనెక్షన్లపై విద్యుత్ శాఖ అధికారులకు అక్రమ కనెక్షన్లు తొలగించే విధంగా లేఖరాస్తానని తెలిపారు.



నాపరాతి కట్టింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న ఏడీ జాకబ్

మెగా డీఎస్సీపై చిగురిస్తున్న ఆశలు

నిరుద్యోగుల్లో ఆశలు నింపిన ముఖ్యమంత్రి ప్రకటన

వికారాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉపాధ్యాయ శిక్షణ పొందిన నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు ఎన్నికల ముందు మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి ఇటీవల విద్యా శాఖపై సమీక్ష నిర్వహించి మెగా డీఎస్సీ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో 5089 ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి నాలుగు నెలల కిందట నోటిఫికేషన్ జారీ చేయగా, దీంట్లో వికారాబాద్ జిల్లాలో 191 పోస్టుల భర్తీ చేయాలని నిర్ణయించారు.

» 4 నెలల కిందట 191 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి టీఆర్టీ నోటిఫికేషన్..
» మూసివేసిన బడులను పున:ప్రారంభించి..
» ఉపాధ్యాయ పదోన్నతులు కల్పిస్తే 350 పోస్టుల వరకు అదనంగా ఖాళీలకు అవకాశం?
» ఉద్యోగ విరమణ ఖాళీలను పరిగణనలోకి తీసుకుంటే ఇంకా పెరగనున్న ఖాళీలు
» ఉపాధ్యాయ నియామకంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని నిరుద్యోగుల వినతి

నిరుద్యోగుల ఆందోళన

కాగా గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయ పోస్టులు తక్కువగా ఉండడంతో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. నోటిఫికేషన్‌లో అరొకరగా చూపిన ఉపాధ్యాయ ఖాళీలను పెంచాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు పెద్ద ఆందోళనలకు దిగిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహిస్తామంటూ టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించిన విషయం తెలిసిందే. తాము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ నిర్వహిస్తామనే అంశాన్ని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా వినియోగించుకుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి 2017లో టీఆర్టీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ తరువాత ఉపాధ్యాయుల నియామకం చేపట్టలేదు. డీఎస్సీ నిర్వహించాలంటూ నిరుద్యోగులు ఆరేళ్ల పాటు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చినా అప్పటి ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. శిక్షణ పూర్తి చేసుకున్న వేలాది మంది నిరుద్యోగులు ఉపాధ్యాయ నియామక నోటిఫికేషన్ కోసం నిరుద్యోగులకు ఎదురు చూపులు తప్పలేదు.

ఎదురుచూపులు ...

గత ప్రభుత్వం ప్రకటించిన ఖాళీలకు మరిన్ని పోస్టులు కలిపి భర్తీ చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మెగా డీఎస్సీ ప్రకటనపై నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 1039 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 743 ప్రాథమిక, 114 ప్రాథమికోన్నత, 182 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలలకు 4638 ఉపాధ్యాయ



పోస్టులు ప్రభుత్వం మంజూరు చేయగా, ప్రస్తుతం 3920 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. జిల్లాలో అన్ని కేటగిరిల్లో గత ఫిబ్రవరి నెల వరకు 718 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే, గత ప్రభుత్వం 191 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా, ఈ పోస్టుల్లో 102 స్కూల్ అసిస్టెంట్, 77 ఎస్‌జీటీ, 12 లాంగ్వేజ్ పండిత్ పోస్టులు ఉన్న విషయం తెలిసిందే. జిల్లాలో ఉపాధ్యాయులు లేని పాఠశాలలు 14 ఉండగా, విద్యార్థులు లేని పాఠశాలలు 34 ఉన్నాయి. 198 పాఠశాలల్లో ఒక్కో ఉపాధ్యాయుడు మాత్రమే పనిచేస్తున్నారు. విద్యార్థులు ఉండి ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు ఇతర పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి విద్యా బోధన కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.

సీఎం నిర్ణయంతో..

ప్రతి గ్రామంలో ఒక ప్రభుత్వ పాఠశాల కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి పాఠశాల విద్యా శాఖ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ పాఠశాలలు లేని గ్రామాలు ఉండకూడదన్న ప్రభుత్వ నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కొత్తగా బీఎడ్, డీఎడ్ పూర్తి చేసుకున్న వారికిసైతం టెట్ రాసే అవకాశం కల్పించే విషయమై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఉపాధ్యాయ ఖాళీలను పూర్తి స్థాయిలో భర్తీ చేసేందుకు అనుబంధ నోటిఫికేషన్ జారీ చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

350 వరకు పెరగనున్న ఉపాధ్యాయ పోస్టులు ?

జిల్లాలో మూత పడిన పాఠశాలలను తెరిపించేలా చర్యలు తీసుకోవడం, పదోన్నతులు కల్పించడం, ఈ ఏడాది చివరి వరకు ఉద్యోగ విరమణ ద్వారా ఏర్పడే ఉద్యోగ ఖాళీలు 350 వరకు ఉండవచ్చనే ప్రచారం జరుగుతోంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు లేక మూత పడిన పాఠశాలలను తెరిపించే విధంగా చర్యలు తీసుకుంటే 100 వరకు ఉపాధ్యాయ పోస్టులు అదనంగా ఏర్పడనున్నట్లు చెబుతున్నారు. మరోవైపు జీహెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల ప్రక్రియ సజావుగా కొనసాగితే మరో 220 పోస్టుల వరకు ఎస్‌జీటీ ఖాళీలు ఏర్పడే అవకాశం ఉందని తెలుస్తోంది. టెట్ అర్హత కలిగిన ఉపాధ్యాయులకే పదోన్నతులు కల్పించాలనే నిబంధనను ఇటీవల ఎన్‌సీఈఆర్టీ కొత్తగా అమల్లోకి తీసుకు రావడంతో గత ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ సజావుగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఇటీవల పాఠశాల విద్యా శాఖ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. టెట్ పరీక్ష నిర్వహించి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తే జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలు పెరగనున్నాయి. స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి పొందడానికి టెట్ అర్హత తప్పనిసరిగా ఉండాలన్న నిబంధన అడ్డంకిగా మారింది. పదోన్నతుల ప్రక్రియ సాఫీగా సాగాలంటే డిపార్ట్‌మెంటల్ పరీక్ష మాదిరిగా ఇన్ సర్వీసు ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టెట్ నిర్వహించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో రెండు లేదా మూడేళ్ల లోపు టెట్ అర్హత సాధించాలన్న షరతు విధించి పదోన్నతులు కల్పించవచ్చని చెబుతున్నారు.

టెట్ నిబంధనల్లో సడలింపు...

పదోన్నతులకు టెట్ అర్హత ఉండాలన్న నిబంధన విషయంలో కొంత సడలింపు వచ్చే విధంగా విద్యా శాఖ అధికారులు జాతీయ విద్యా శిక్షణా పరిశోధనా మండలి ఉన్నతాధికారులతో చర్చిస్తే సానుకూల ఫలితం వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం ఉపాధ్యాయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. అంతే కాకుండా ఈ ఏడాది మార్చి నెల 31వ తేదీ నుంచి ప్రతినెలా 61 సంవత్సరాల వయస్సు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఉద్యోగ విరమణ చేసే వారితో ఏర్పడే ఉపాధ్యాయ ఖాళీలను కూడా పరిగణనలోకి తీసుకుంటే మరిన్ని ఖాళీల భర్తీకి అవకాశం ఏర్పడనుంది. గత ప్రభుత్వం జిల్లాలో 191 పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేయగా, కొత్తగా మరో 350 ఉపాధ్యాయ ఖాళీలు ఏర్పడే అవకాశం ఉందని చెబుతున్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

కడ్తాల్, జనవరి 4 : మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి కాంక్షించే మహాలక్ష్మి పథకాన్ని రూపొందించి అమలుకు చర్యలు తీసుకుంటుందని అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలోని గూడూరు కేశవ రెడ్డి గార్డెన్‌లో గురువారం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే, జడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీ సింగ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కడ్తాల, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాలకు చెందిన 116 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, వైస్ఎంపీపీ ఆనంద్, జడ్పీటీసీ దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, స్థానిక సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్‌లు ముంతాజ్, లలిత, రంగారెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం తహసీల్దార్ ముంతాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నారాయణరెడ్డి మాట్లాడుతూ మహిళల కళ్లల్లో ఆనందమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా కల్యాణమస్తు పథకంలో భాగంగా ఆడబిడ్డల పెళ్లిళ్లకు రూ.లక్ష ఆర్థికసాయంతో పాటు ఇందిరమ్మ కానుకగా తులం బంగారం త్వరలో అందించడం జరుగుతుందని నారాయణరెడ్డి తెలిపారు. ఇందిరమ్మ పాలనలో అన్నివర్గాలకు మేలు జరుగుతుందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తుందని, వివక్షతకు తావులేకుండా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, ఎంపీటీసీ సభ్యులు పాలకుర్ల రాములు, బొప్పిడి గోపాల్, లచ్చిరామ్‌నాయక్, ఉమావతి బుగ్గయ్యగౌడ్, మంజుల చంద్రమౌళి, నిర్మలాదేవికాశీనాథ్ రెడ్డి, ప్రియ రమేశ్,పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, సర్పంచ్ లు శంకర్, భారతమ్మవిఠలయ్యగౌడ్, తులసీరామ్ నాయక్, సులోచన, సుగుణ, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు గూడూరు భాస్కర్‌రెడ్డి, కృష్ణనాయక్, శ్రీను, మల్లేశ్‌గౌడ్, శేఖర్ గౌడ్, రాంచందర్ నాయక్, జహంగీర్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ కె.నర్సింహులు

దివ్యాంగులు స్వయం ఉపాధి పొందాలి

» డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ నర్సింహులు

వికారాబాద్, జనవరి 4: దివ్యాంగులందరూ స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ నర్సింహులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం డాక్టర్ రెడ్డిస్ ఫౌండేషన్, సిడ్బీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని చిన్న, చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న నిరుపేద దివ్యాంగులను గుర్తించి వారికి వారి ప్రతిభకు తగ్గట్లు వ్యాపారంలో రాణించేలా చేయూతనివ్వాలన్నారు. అర్హులైన 43మంది దివ్యాంగులకు రూ.25వేల ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు తెలిపారు. సిడ్బీ ప్రతినిధి దక్షిణామూర్తి, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీలక్ష్మి, పీఎస్ శ్రీనివాస్, ఉదయ్, జిల్లా కోఆర్డినేటర్ రామేశ్వర్, కమ్యూనిటీ లీడర్లు సంజీవరావు, రాములు, శ్రీశైలం, యాదయ్య లబ్ధిదారులు బాలరాజు, వెంకటయ్య శ్రీశైలం, రాజు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలూరు–మహేశ్వరం రోడ్డు పూర్తి చేయరూ?

» ఆరు నెలలుగా కొనసాగుతున్న విస్తరణ పనులు
» కంకర, మట్టితో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
» పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. పట్టించుకోని అధికారులు

మహేశ్వరం, జనవరి 4: తుమ్మలూరు-మహేశ్వరం రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆరు నెలలుగా ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ రోడ్డు విస్తరణకు 5కిలోమీటర్లకు రూ.14కోట్లు విడుదల చేసింది. రోడ్డు పనులను ప్రారంభంలో వేగవంతంగానే చేసినా సదరు కాంట్రాక్టర్ ఇప్పుడు ఆ పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో తుమ్మలూరు, మహేశ్వరం ప్రజలే కాకుండా రెండు జాతీయ రహదారులైన శ్రీశైలం, బెంగళూరు హైవేలకు అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డు పనులు నత్తనడకన సాగుతుండడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై వెళ్లే వాహనాల కంకరరాళ్లు తగులుతూ టైర్లు పంక్చర్ అవుతున్నాయి. వాహనాలు రిపేర్‌కు వస్తున్నాయి. దుమ్ముతో ద్విచక్ర వాహనదారుల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. బెంగళూరు హైవే ప్రాంత వాహనాలు, ప్రయాణికులు శ్రీశైలం జాతీయ రహదారిపైకి రావాలంటే తుమ్మలూరు-మహేశ్వరం రోడ్డు గుండానే రావాలి. ఇంత కీలక రోడ్డు విస్తరణ పనులు ఆరు నెలలుగా కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. నూతన ప్రభుత్వంలోనైనా ఈ రోడ్డు పనుల్లో వేగం పెరుగుతుందా? అని ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు.



నత్తనడకన సాగుతున్న తుమ్మలూర-మహేశ్వరం రోడ్డు



కంకరకే పరిమితమైన తుమ్మలూరు రోడ్డు

కాంట్రాక్టర్ పనులు వేగంగా చేయడం లేదు



ఆరు నెలలుగా రోడ్డు విస్తరణ పనులతో ప్రజలు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గత ప్రభుత్వం రోడ్డు విస్తరణకు రూ.14కోట్లు విడుదల చేసినా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ వేగంగా పనులు చేయడంలేదు. దుమ్ము లేస్తున్న ఈ రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు. కంకరతో వాహనాలు రిపేర్‌కు వస్తున్నాయి. ఇప్పటికైనా ఈ రోడ్డు పనులను త్వరగా పూర్తిచేసి ఇబ్బందులను తీర్చాలి. ఇందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

– మద్ది సురేఖ, సర్పంచ్, తుమ్మలూరు

రోడ్డు పనులను పూర్తిచేసి అందుబాటులోకి తెస్తాం

కల్వర్టుల నిర్మాణం, రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలతో ఇప్పటి వరకు పనుల్లో జాప్యం జరిగింది. ఇప్పుడు కల్వర్టుల నిర్మాణం జరుగుతోంది. విద్యుత్ స్తంభాలను సైతం తొలగిస్తున్నాం. త్వరలోనే కల్వర్టుల నిర్మాణం పూర్తి చేస్తాం. రోడ్డు పనులన్నీ పూర్తిచేసి త్వరలోనే కొత్త రోడ్డును ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తాం.

– విజయ్, ఏఈ, ఆర్అండ్‌బీ

అర్హులందరికీ రేషన్ కార్డులు

- ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ● కొనసాగుతున్న అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ



శంషాబాద్ : దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి


షాద్‌నగర్, జనవరి 4: అర్హత కలిగిన వారందరికీ రేషన్‌కార్డులు, ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం అందజేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొండోనిబాయి తండాలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గొప్పలు చెప్పుకోవడం తప్ప.. ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. 14 ఏళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వకుండా పేద ప్రజలను ఆర్థిక దోపిడీకి గురి చేశారన్నారు. గిరిజనుల పట్ల నాయకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున ప్రతీ గిరిజన తండాలో ఎమ్మెల్యేలను పర్యటించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారని, దాంతో తాము ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొంటున్నామని చెప్పారు. రేషన్‌కార్డులు, పింఛన్లు, ఉద్యోగాల గురించి ఎవరూ ఎలాంటి ఆందోళన చెందరాదని తెలిపారు.

'అభయహస్తం'నకు దరఖాస్తు చేసుకోవాలి

చౌదరిగూడ : అర్హులందరూ అభయహస్తం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మహేష్‌బాబు సూచించారు. మండల పరిధిలోని పెద్దఎల్కిచర్లలో సర్పంచ్ కమ్మరి భూపాలచారితో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుమార్, జయలక్ష్మి, అరుణ, నాయకులు రాజు, ఇద్రీస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి : ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్‌లు బాల్‌రామ్, శోభచందు, పబ్బతి శ్రీనయ్యలు కోరారు. ఆమనగల్లు మండలంలోని పోలెపల్లి, కొత్తకుంట తండా, చెన్నంపల్లి గ్రామాల్లో ఎంపీడీవో పారుఖ్‌హుస్సెన్ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు. ఎంపీటీసీ కుమార్, తదితరులున్నారు. కడ్తాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్‌లు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ఖచ్చితంగా అమలు చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రజాపాలనలో పేదలందరికి మేలు జరుగుతుందని చెప్పారు. జడ్పీటీసీలు దశరథ్ నాయక్, ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ ముంతాజ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. తలకొండపల్లి మండలం హర్యనాయక్ తండా, తుమ్మల కుంట తండాలో దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచ్‌లు గోపాల్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, ఎంపీడీవో శ్రీకాంత్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ : వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

శంషాబాద్ : అర్హులందరూ అభయహస్తం కింద అందించే పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ఆర్బీనగర్ బస్తీలో గురువారం జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులను సిబ్బందికి అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి, కమిషనర్ భోగేశ్వర్లు కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న శంషాబాద్‌కు చెందిన శ్రీశైలంగౌడ్‌ను ప్రకాష్ గౌడ్ పరామర్శించారు. కొన్ని రోజులక్రితం తన సమస్యను ఓ ప్రభుత్వ కార్యక్రమంలో విన్నవించేందుకు బైక్‌పై వెళుతుండగా బైక్ అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో.. అనంతరం ఇంటి వద్దే చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. పుష్పలత, బుచ్చిరెడ్డి, నరేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

జోరుగా దరఖాస్తులు

కందుకూరు : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. గురువారం సాయంత్రం వరకు మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో 15వేల 388 దరఖాస్తులు అందాయని ఎంపీడీవో వెంకట్రాములు తెలిపారు. కాగా, గురువారం కొలన్‌గూడ, బేగరికంచ, కటికపల్లి, మీర్కాన్‌పేట, జబ్బార్‌గూడలో గ్రామ సభలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1467 దరఖాస్తులతో పాటు 159మంది కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో తెలిపారు.

పేదలకు చేయూతనిచ్చేందుకే ప్రజాపాలన

ఇబ్రహీంపట్నం : బడుగు, బలహీన వర్గాలు, ఆర్థికంగా వెనకబడ్డ వర్గాలకు చేయూత నిచ్చేందుకే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమం చేపట్టిందని ఇబ్రహీంపట్నం జడ్పీటీసీ భూపతిగల్ల మహిపాల్ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. మండల పరిధిలోని తులేకలాన్ గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ఎంపీపీ కృపేష్, ఎంపీడీవో వెంకటమ్మ, పంచాయతీరాజ్ ఏఈ ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్ యాదగిరి, ఉప సర్పంచ్ రాజిరెడ్డి తదితరులున్నారు.

ప్రతీ ఫిర్యాదును సమీక్షిస్తాం

యాచారం : ప్రజాపాలనలో భాగంగా వచ్చిన ప్రతీ ఫిర్యాదును సమీక్షించి ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. కుర్మిద్ద ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. నజ్దిక్‌సింగారంలో జరిగిన సభలో ఎంపీవో ఉమారాణి పాల్గొన్నారు. కార్యక్రమాల్లో సర్పంచులు బి.రాజశేఖర్‌రెడ్డి, లత, డిప్యూటీ తహసీల్దారు సాగర్ తదితరులున్నారు. కాగా గత ఆరు రోజులుగా జరిగిన ప్రజాపాలనలో 14,664 ఫిర్యాదులందాయని ఎంపీడీవో చెప్పారు. ఇదిలా ఉండగా మండలంలో ప్రజాపాలన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మహేశ్వరం అదనపు డీసీపీ శ్రీనివాస్ ప్రతీ రోజు గ్రామాల్లో పర్యటించి తగిన చర్యలు తీసుకున్నారు.



కడ్తాల : దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, బాలాజీసింగ్

ఆరు గ్యారంటీలను సద్వినియోగం చేసుకోవాలి

శంకర్‌పల్లి/షాబాద్ : ఆరు గ్యారంటీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో ప్రభాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మోకిల గ్రామంలో, మున్సిపల్ పరిధిలోని 3,14,15వ వార్డుల్లో దరఖాస్తులు స్వీకరించారు. ఎంపీడీవో వెంకయ్య, మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్ శ్వేతాపాండురంగారెడ్డి, సర్పంచ్ సుమిత్రా మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రతీ ఒక్కరు షాబాద్ రేపటి లోపు ప్రజాపాలన దరఖాస్తులు చేసుకోవాలని రుద్రారం సర్పంచ్ స్వర్ణలతా సతీష్‌యాదవ్ అన్నారు. షాబాద్ మండలం రుద్రారం గ్రామంలో దరఖాస్తులను స్వీకరించారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి : అభయహస్తం దరఖాస్తు స్వీకరిస్తున్న డీఆర్డీవో ప్రభాకర్



ఇబ్రహీంపట్నం : తులేకలాన్‌లో దరఖాస్తులు తీసుకుంటున్న జడ్పీటీసీ మహిపాల్, తదితరులు

అధికారులు అందుబాటులో ఉండాలి



కొత్తూర్ : తిమ్మాపూర్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సీజీఎం ఆనంద్

కొత్తూర్, జనవరి 4 : విద్యుత్ వినియోగదారులకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని రంగారెడ్డి జోన్ టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీజీఎం పి.ఆనంద్ సూచించారు. ప్రజాపాలనలో భాగంగా గురువారం మున్సిపాలిటీలోని తిమ్మాపూర్‌లో విద్యుత్ అధికారులు పర్యటించి గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు అధికారుల దృష్టికి వస్తే వెంటనే స్పందించి పరిష్కారించాలని సూచించారు. అలాగే విద్యుత్ నిరంతరం సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎస్ఈ గోపయ్య, కొత్తూర్ ఏడీఈ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ మహిళ మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

షాద్‌నగర్, జనవరి 4 : అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతిచెందిన ఘటన గురువారం షాద్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కొందుర్గు మండలం శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన మణెమ్మ జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతోంది. గ్రామంలో ఉన్న ఆర్ఎంపీ వైద్యుడిని సంప్రదించగా.. షాద్‌నగర్ పట్టణంలోని ఏబీవీ ఆస్పత్రికి వెళ్లమని సూచించారు. దాంతో ఆమె కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించి మూడు రోజులుగా చికిత్స అందిస్తున్నారు. ఈక్రమంలో గురువారం పరిస్థితి విషమించడంతో వైద్యులు కుటుంబ సభ్యులకు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దాంతో ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా షాద్‌నగర్ చౌరస్తా వద్దకు వెళ్లగానే మృతిచెందింది. దాంతో కోపోద్రిక్తులైన బంధువులు ఆస్పత్రికి చేరుకొని మణెమ్మకు సరైన వైద్యం అందించలేదని ఆందోళనకు దిగారు. కాగా, ఆమె ఆరోగ్యం క్షీణించడంతోనే ఇక్కడి నుంచి తీసుకెళ్లమని సూచించనట్లు వైద్యులు తెలిపారు. కొద్దిసేపటి తర్వాత బంధువులు మృతదేహాన్ని తీసుకొని వెళ్లిపోయారు.

బైక్ చోరీ కేసులో ఒకరికి జైలు

తలకొండపల్లి, జనవరి 4: బైక్ చోరీ కేసులో తలకొండపల్లి మండలం లింగరావుపల్లికి చెందిన రాంపూర్ అంజయ్యకు 5 నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ గురువారం ఆమనగల్లు మున్సిఫ్ కోర్టు తీర్పు వెలువరించిందని ఎస్ఐ శ్రీను తెలిపారు. 2023 జూలైలో జూపల్లికి చెందిన గోపాల్ తలకొండపల్లి మండల కేంద్రానికి బైక్‌పై వెళ్లాడు. సాయంత్రం సమయంలో వైన్‌షాప్ ముందు బైక్ పార్క్ చేసి పక్కనే ఉన్న సబ్‌స్టేషన్‌లోకి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి బైక్ కన్పించలేదు. బైక్ పార్క్‌చేసే సమయంలో రాంపూర్ అంజయ్య అక్కడే అనుమానాస్పదంగా తిరుగుతున్నాడని బాధితుడు గోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని సాక్ష్యాధారాలతో నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో 5నెలల సాధారణ శిక్ష విధిస్తూ న్యాయమూర్తి కాటం స్వరూప తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ తెలిపారు.

భార్యాభర్తలపై దాడి కేసులో ముగ్గురిపై కేసు

శంషాబాద్ రూరల్, జనవరి 4 : భార్యభర్తలపై దాడిచేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసిన ఘటన గురువారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని హమీదుల్లానగర్ గ్రామానికి చెందిన గడ్డం రవి గురువారం ఇంటి ముందు ఉన్న సమయంలో.. తనను చూసి హేళన చేశారని కోపంతో.. సొంత అన్న కొడుకు గడ్డం శ్రీకాంత్‌యాదవ్, బాధితుడిపై కత్తితో దాడి చేశాడు. దాంతో రవి గదవకు తీవ్ర గాయమైంది. తరువాత రవి భార్య అడ్డురాగా శ్రీకాంత్‌యాదవ్ తమ్ముడు అభిలాష్, తల్లి లలితలు బాధితులపై దాడి చేయడంతో పాటు బూతులు తిట్టి చంపేస్తామని బెదరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు శ్రీకాంత్‌యాదవ్, అభిలాష్‌యాదవ్, లలితపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వీ-టీసీ-సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

- ఈ నెల 6 వరకు తుది గడువు, ఫిబ్రవరి 11న పరీక్ష

రంగారెడ్డి అర్బన్, జనవరి 4 : తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ, గిరిజన, బీసీ, జనరల్ గురుకులాల 5వ తరగతి ఉమ్మడి ప్రవేశ పరీక్ష(వీ-టీసీ-సెట్-2024) ఫిబ్రవరి 11న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాళ్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 6వ తేదీ తుది గడువు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థినీవిద్యార్థులు అర్హులని, మీ సేవ లేదా ఇంటర్నెట్ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కలెక్టర్ చేతుల మీదుగా పోస్టర్ విడుదల



ప్రవేశ పరీక్ష పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శశాంక

కాగా, ఉమ్మడి ప్రవేశ పరీక్ష పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ శశాంక్, అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో కందుకూరు ప్రిన్సిపాల్ పి.రఘునందన్‌రావు, శంషాబాద్ ప్రిన్సిపాల్ కె.యాదయ్య, ఎం.రాజారావు, ఎం.రవీందర్‌రెడ్డి, సి.నరేందర్ పాల్గొన్నారు.

మోకిల సీఐగా వీరబాబు



శంకర్‌పల్లి, జనవరి 4: మోకిల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వీరబాబును నియమిస్తూ సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకుముందు మోకిల సీఐగా విధులు నిర్వహించిన నరేష్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో ఆయన్ను సైబరాబాద్ కమిషనరేట్‌కు అటాచ్ చేశారు. గతంలో శంషాబాద్ సీసీఎస్‌లో సీఐగా విధులు నిర్వహించిన వీరబాబును మోకిల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



ముస్తాబైన ఆలయం

కేశంపేట, జనవరి 4: మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారు నంబయ్య గుట్టపైన వెలసిన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు నేటి(శుక్రవారం) నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ ఉత్సవాలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించనున్నారు. శుక్రవారం అంకురార్పణంతో పూజ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. సర్పంచ్ మంజుల మల్లేష్, ఎంపీటీసీ అనురాధ పర్వత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చిర్ర చంద్రయ్య, మనోహర్‌గౌడ్ ఉత్సవాల నిర్వహణ ఏర్పాటు పూర్తి చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

రెవెన్యూ మంత్రిని కలిసిన నాయకులు



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆంజనేయులు, తదితరులు

కందుకూరు, జనవరి 4 : రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి రాష్ట్ర హ్యూమన్‌రైట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు బి.ఆంజనేయులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డిలు నూతన సంవత్సర శుభాకాక్షలు తెలిపారు. గురువారం నగరంలోని మంత్రి నివాసానికి మర్యాద పూర్వకంగా వెళ్లి నూతన సంవత్సర శుభాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అందుగుల సత్యనారాయణ, హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి కిరణ్, జాయింట్ సెక్రటరీ ఎండి నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి లక్ష విరాళం

తలకొండపల్లి, జనవరి 4 : మండల పరిధిలోని దాస్య తండాలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. తండాలో ఆలయ నిర్మాణానికి సహకరించాలని గిరిజనులు వెంకటేశ్‌ను అభ్యర్థించారు. దాంతో స్పందించిన వెంకటేశ్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం ప్రకటించారు. గురువారం ట్రస్ట్ సభ్యుడు ముకురాల అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు తండావాసులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి చేయూతనందించిన వెంకటేశ్‌ను గిరిజనులు అభినందించారు. సక్రియ, సక్రు, బీమా, బక్క, గోపాల్, దస్రు, రవి, వినోద్, భాస్కర్, పాండ్య, చంద్ర్య, గోపి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలతో ఊరేగింపు



కందుకూరు : దెబ్బడగూడలో ఇంటింటికీ అక్షింతలు తీసుకెళ్తున్న భక్తులు, తదితరులు

కొత్తూర్/కందుకూరు/చేవెళ్ల, జనవరి 4: అయోధ్య అక్షింతలతో కొత్తూర్ మండల కేంద్రంలోని పురవీధుల్లో గురువారం పలువురు నాయకులు ఊరేగింపు నిర్వహించారు. స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు ముఖ్యవీధుల్లో కొనసాగిస్తూ జైశ్రీరామ్ నినాదాలు చేశారు. అనంతరం ఇంటింటికీ అక్షింతల వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జంగగళ్ల కృష్ణయ్య, ఆయా పార్టీల నాయకులు బి.దేవేందర్‌యాదవ్, కడెంపల్లి సదానంద్‌గౌడ్, నాగరాజుచారి, రామకృష్ణముదిరాజ్, వేణుగోపాల్‌చారి, టి.శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే కందుకూరు మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటికీ అక్షింతలు అందజేశారు. మండలంలోని దెబ్బడగూడ సర్పంచ్ ఏనుగు శ్రావణి ఆధ్వర్యంలో గ్రామస్తులు శివరామాంజనేయ స్వామి ఆలయం నుంచి ఇంటింటికీ వెళ్లి అక్షింతలు అందజేశారు. అదేవిధంగా మండల కేంద్రంలో కూడా అక్షింతలు అందజేశారు.



కొత్తూర్‌లో అయోధ్య అక్షింతలతో ఊరేగింపు నిర్వహిస్తున్న నాయకులు

అయోధ్య అక్షింతలతో నేడు ర్యాలీ

చేవెళ్ల : అయోధ్య నుంచి వచ్చిన పూజిత అక్షింతలతో, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నేడు భారీ ర్యాలీ నిర్వహిస్తామని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి గురువారం తెలిపారు. ఉదయం 8గంటలకు చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి శ్రీ రామభక్త హనుమాన్ మందిరం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. శ్రీరామ నామ సంకీర్తనలతో స్వాగతం పలకాలని, భక్తులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వ్యవసాయ పొలాలకు 'మార్గం' చూపాలి



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

ఆమనగల్లు, జనవరి 4: మండల పరిధిలోని చెన్నంపల్లి గ్రామం నుంచి వ్యవసాయ పొలాలకు వెళ్లే మార్గంలో రోడ్డును యథావిధిగా కొనసాగించాలని రైతులు ఎంపీడీవో పారుఖ్‌హుస్సేన్‌ను కోరారు. ఈమేరకు గురువారం సర్పంచ్ శ్రీనయ్యతో కలిసి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని 41 సర్వే నెంబర్‌లో బట్టర్ఫ్లై సిటీ నిర్వాహకులు వెంచర్ చేస్తున్నారని, అదే సర్వే నెంబర్‌ను అనుసరించి ఉన్న 42,43,47,48 సర్వే నెంబర్లలోని భూములకు వెళ్లడానికి వీలుగా గతంలో 18 ఫీట్ల రోడ్డును ఈజీఎస్‌లో భాగంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం సర్వేనెంబర్ 41లో వెంచర్ చేస్తున్నందున పది శాతం గ్రామ పంచాయతీ స్థలం కింద ఆ రోడ్డును స్వాధీనం చేసుకొని తమ పొలాలకు వెళ్లడానికి వీలుగా శాశ్వతంగా రోడ్డును నిర్మించి ఇబ్బందు లు తీర్చాలని ఎంపీడీవోను కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో గోపాల్, నర్సింహ, వెంకటయ్య, శ్రీను, జంగయ్య ప్రశాంత్, రవికుమార్, రామస్వామి, మహేశ్, టి.నర్సింహ తదితరులు ఉన్నారు.

జాతీయ సాహస శిబిరంలో పాల్గొనాలి

షాద్‌నగర్ అర్బన్, జనవరి 4: ప్రతీ విద్యార్థి జాతీయ సాహస శిబిరంలో పాల్గొని శిక్షణ పొందాల్సిన అవసరం ఉందని షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి తెలిపారు. భారత ప్రభుత్వ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో హిమాచల్‌ప్రదేశ్‌లోని నర్కండలో జరుగుతున్న సాహస శిబిరానికి డాక్టర్ రవీందర్‌రెడ్డి తెలంగాణ నుంచి కంటెస్టెంట్ లీడర్‌గా వెళ్లారు. పాలమూరు యూనివర్సిటీ నుంచి పది మంది విద్యార్థులు అక్కడ శిక్షణ పొందుతున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 35మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ట్రెక్కింగ్, పర్వతారోహణ, రివర్ క్రాసింగ్ వంటి శిక్షణ గురువారం పూర్తయిందని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు ఎదురైన సమయంలో ప్రజలు, ప్రమాదంలో ఉన్నప్పుడు వారిని రక్షించడానికి ఈ సాహస శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని రవీందర్‌రెడ్డి తెలిపారు.



రివర్ క్రాసింగ్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

వేంకటేశ్వరాలయం హుండీ లెక్కింపు

తలకొండపల్లి, జనవరి 4 : తలకొండపల్లి మండలం రాంపూర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని గురువారం ఆలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో స్నేహలత, సర్పంచ్ శ్యామ్‌సుందర్ రెడ్డి ల సమక్షంలో హుండీలను లెక్కించారు. బ్రహ్మోత్సవాల ముగింపు నేపథ్యంలో చేపట్టిన హుండీ లెక్కింపు చేపట్టారు. హుండీ ఆదాయం రూ.48,177 వచ్చినట్లు ఈవో స్నేహలత తెలిపారు. కాగా, హుండీ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి, భక్తుల సదుపాయాల కల్పనకు వినియోగించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ శ్రీశైలం యాదవ్, నాయకులు యాదయ్య, వెంకటయ్య, హరిమోహన్ రెడ్డి, శ్రవణ్, కృష్ణారెడ్డి, దేవాదాయ శాఖ సిబ్బంది దేవేందర్ రెడ్డి, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించాలి



నోట్‌పుస్తకాలను అందిస్తున్న మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు

యాచారం, జనవరి 4 : విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని యాచారం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం నల్లవెల్లి ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఆయన ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సాయమందించడం కోసం దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఈదులకంటి లక్ష్మీపతిగౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

తలకొండపల్లి, జనవరి 4: మండల పరిధిలోని పెద్దూర్ తండాలో అయ్యప్ప మహా పడిపూజ, ఇరుముడి కార్యక్రమాలను గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మూడావత్ ఫణీందర్, మధు, రమేశ్, అభిషేక్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజలో అయ్యప్ప మాలధారులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిపూజ, ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తుల అయ్యప్ప నామస్మరణతో పెద్దూర్ తండా మార్మోగింది. అయ్యప్ప భక్తుల గీతాలాపనలు, భజనలు అందరిని అలరించాయి. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అయ్యప్ప పడిపూజలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, సర్పంచ్‌లు కాడెమోని శ్రీశైలం, మూడావత్ కిషన్, నాయకులు శ్రీను, సత్యం, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి, జనవరి 4: మండల కేంద్రానికి చెందిన యాదయ్య ఇంటి నిర్మాణానికి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణానికి చేయూతనందించాలని యాదయ్య ఇటీవల వెంకటేశ్‌ను ఆశ్రయించాడు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అసంపూర్తి పనులకు అవసరమైన మెటీరియల్‌ను సమకూర్చారు. గురువారం ట్రస్ట్ సభ్యులు యాదయ్యకు అందజేశారు. సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్‌యాదవ్, నాయకులు వెంకటేశ్, శ్రీశైలం, యాదయ్య, హరీశ్, జంగయ్య, చిన్నయ్య తదితరులున్నారు.